
సాక్షి
కాకినాడ

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 1,730, మధ్య డెల్టాకు 1,125, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.



వాడపల్లి వెంకన్నకు రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వకుళమాత భవన నిర్మాణానికి దుద్దుపూడి శ్రీధర్, పద్మ దంపతులు (రాజమహేంద్రవరం) రూ.లక్ష విరాళంగా సమర్పించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సెహరీ బుధ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.25	4.34
కాకినాడ	6.25	4.34
అమలాపురం	6.25	4.34

న్యూస్‌రీల్

వలంటీర్ల ఆత్మగౌరవం దెబ్బ తీస్తున్న ప్రతిపక్షాలు



ఆవాల రాజేశ్వరి

సామర్లకోట: వలంటీర్ల ఆత్మగౌరవాన్ని ప్రతిపక్షాలు దెబ్బ తీస్తున్నాయని రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి అన్నారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే వలంటీర్ల ద్వారా అందే పింఛన్లు అందకుండా చంద్రబాబు నాయుడు అండ్ కో రాష్ట్ర మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌ను అడ్డం పెట్టుకొని ఎన్నికల అధికారికి తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. నిమ్మగడ్డ రమేష్ ఫిర్యాదుతో వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయరాదంటూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. కమిషన్ నిర్ణయాన్ని నిరసిస్తూ ఇప్పటికే అనేక మంది వలంటీర్లు రాజీనామాలు చేస్తున్నారని తెలిపారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు అందించిన సేవలను ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి నెలా పింఛను తీసుకోవాలనే లక్ష్యంతో లబ్ధిదారులు ఇతర రాష్ట్రాల్లో ఉన్నా వెళ్లి మరీ వలంటీర్లు పింఛన్లు అందజేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలను ఇబ్బంది పెట్టడమే ప్రతిపక్షాల లక్ష్యమని మండిపడ్డారు. పొరపాటున టీడీపీకి అధికారం ఇస్తే వలంటీరు వ్యవస్థను రద్దు చేస్తారని చెప్పడానికి ఇదే నిదర్శనమని చెప్పారు. రెండు వార్డులకు ఒకచోట ఉన్న సచివాలయానికి దివ్యాంగులు, అవ్వాతాతలు పింఛన్ల కోసం వెళ్లాల్సిన దుస్థితి కల్పించడం దురదృష్టకరమని రాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు.

రత్నగిరిపై పెళ్లి బృందాలకు ఊరట

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకునే వారికి ఊరటనిచ్చేలా అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశాలు జారీ చేశారు. రత్నగిరిపై వివాహాది శుభకార్యాలు నిర్వహించుకునే వారు 50 మంది లోపు భోజనాలు, ఫలహారాలకు ఏ రుసుం చెల్లించనవసరం లేదని తెలిపారు. అంతకు మించి ఎక్కువ మందికి భోజనాలు, ఫలహారాలు తీసుకుని వెళ్తే దేవస్థానానికి నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈవిధంగా భోజనాలు, ఫలహారాలు దిగువ నుంచి తెచ్చుకునే వారిని దేవస్థానంలో క్యాంటీన్లు లీజుకు తీసుకున్న కాంట్రాక్టర్లు ఇబ్బంది పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ములగపూడి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

రౌతులపూడి: హైకోర్టు ఆదేశాల మేరకు ములగపూడి సర్పంచ్ తమరాన సత్యనారాయణ చెక్ పవర్‌ను జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కె.భారతి సౌజన్య రద్దు చేశారు. ఈ మేరకు ఉత్తర్వులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి సోమవారం పంపించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో 2023లో కాంట్రాక్టర్లు గాది తాతారావు, గొరిపాటి అశోక్‌లు గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించారు. ఆ పనులకు సంబంధించి రూ.10.72 లక్షల బిల్లులు సకాలంలో చెల్లించకపోవటంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై రికార్డులను పరిశీలించిన అనంతరం సర్పంచ్ సత్యనారాయణకు గతంలో షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆయన స్పందించకపోవడంతో బిల్లులు చెల్లింపులో జాప్యం చేయడమే కాకుండా కోర్టు ఉత్తర్వులు ధిక్కరించారని పేర్కొంటూ సర్పంచ్ సత్యనారాయణ చెక్‌పవర్ రద్దు చేయాలని డీపీఓను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు డీపీఓ సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేసి, గ్రామ పంచాయతీ నిధులు డ్రా చేసే అధికారాన్ని పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధికారికి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎలక్ట్రిక్ బైక్‌ల దగ్ధం

కాకినాడ రూరల్: వాకలపూడి గంగానగర్‌లో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు ఎలక్ట్రిక్ బైక్‌లు, ఒక మోటార్ సైకిల్, కంప్యూటర్ సామగ్రి దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని సాలిపేట ఏడీఎఫ్ఓ సుబ్బారావు తెలిపారు. షేక్ కరీమ్ ఇంటి వద్ద ఉన్న దుకాణంలో కట్టా బుల్లేశ్వరరావు కొత్త బైక్‌ల అమ్మకాలు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి దుకాణం మూసివేసి వెళ్లిపోయాడు. తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని అగ్నిమాపక అధికారి సుబ్బారావు తెలిపారు. మంటలు అదుపు చేసే కార్యక్రమంలో ఎల్ఎఫ్ జీఎస్ఆర్‌కే రెడ్డి, భాస్కరరావు పాల్గొన్నారు. ఇంద్రపాలెంలో ప్రేమకుమారి అనే మహిళ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన మరో ప్రమాదంలో సుమారు రూ.50 వేల ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

పండుటాకులపై పగ

- పింఛన్ల పంపిణీకి దూరమైన వలంటీర్లు
- అవ్వాతాతలు, దివ్యాంగులకు తప్పని ఇబ్బందులు
- అందుతుందో లేదోనని అవ్వాతాతల ఆందోళన
- రేపటి నుంచి సచివాలయాల్లోనే పంపిణీ

కాకినాడ సిటీ: ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం 5 గంటలకే అవ్వాతాతల ఇళ్ల తలుపులు తట్టి, పింఛన్లు అందిస్తూ, వారి మోముల్లో చిరునవ్వులు నింపేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. వలంటీర్ల ద్వారా నేరుగా ఇళ్లవద్దనే పింఛన్లు పంపిణీ చేస్తూ వారికి అండగా నిలిచేది. ఇది చూసి ఓర్వలేని టీడీపీ ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకుని అక్కసు వెళ్లగక్కింది. ఫలితంగా ఇప్పటి వరకూ ఇళ్ల వద్దనే నిశ్చింతగా పింఛన్లు పొందుతున్న పండుటాకులైన అవ్వాతాతలు, దివ్యాంగులు నేడు గడప దాటక తప్పని పరిస్థితిని తీసుకుని వచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం 16 రకాల పింఛన్లు అందిస్తోంది. జిల్లాలో 2.63 లక్షల మంది వివిధ కేటగిరీ పింఛన్లు పొందుతున్నారు. వీరిలో 70 శాతం మంది అవ్వాతాతలు, దివ్యాంగులు, వివిధ వ్యాధులతో బాధ పడుతున్న వారే ఉన్నారు. వీరిలో 10 శాతం మంది మంచానికే పరిమితమయ్యారు. వారితో పాటు డయాలసిస్ చేయించుకుంటున్న వేలాది మంది అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి. వేలాది మందిని సచివాలయాలకు ఎత్తుకొని తీసుకుని రావాల్సి ఉంటుంది. ఇటువంటి వారందరూ ఈ నెల నుంచి జూన్ వరకూ గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి పింఛన్లు అందుకోవాల్సిందే.

నాడు ఎన్నో ఇబ్బందులు

టీడీపీ హయాంలో పింఛన్ పొందేందుకు అవ్వాతాతలు, దివ్యాంగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పాఠశాల ప్రాంగణాలు, రచ్చబండల వద్ద పడిగాపులు కాసేవారు. డబ్బులు రాలేదని రేపు మాపు అంటూ తిప్పుకునేవారు. ఎంత మంది అర్హులు ఉన్నా మండలానికి ఇన్నే పింఛన్లు అని కోటా పెట్టేవారు. ఒక్కో గ్రామానికి 10-15 పింఛన్లు మాత్రమే ఇచ్చేవారు. **జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకుంటేనే లబ్ధిదారులను ఎంపిక చేసేవారు. దీనికోసం నాలుగైదు నెలల పింఛను మొత్తాన్ని వారికి లంచంగా ముట్టజెప్పాల్సి వచ్చేది. ప్రతి నెలా ఇచ్చే పింఛన్‌లో** సైతం రూ.100, రూ.200 కోత పెట్టేవారు. ఎవరైనా మరణిస్తేనే వారి స్థానంలో కొత్త పింఛను ఇచ్చే వారు.

అందుకే అక్కసు

ఇటువంటి కష్టాలకు వైఎస్సార్ సీపీ పాలనలో ఫుల్‌స్టాప్ పడింది. అర్హతే ప్రామాణికంగా, రాజకీయాలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారు. ప్రతి 50 ఇళ్లకు గ్రామ/వార్డు వలంటీర్‌ను నియమించి, వారి ద్వారా నేరుగా ఇంటివద్దనే పింఛన్ అందించే ఏర్పాటు చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీ పండగ ఉన్నా, సెలవైనా, వానొచ్చినా వరదొచ్చినా ఇంటికి వెళ్లి మరీ వలంటీర్లు పింఛన్లు అందిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే అక్కడికే వెళ్లి మరీ పింఛన్లు అందజేస్తున్నారు. వలంటీర్లు నిస్వార్థంగా, సేవాభావంతో పని చేస్తూండటంతో.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తూండటాన్ని టీడీపీ ఓర్వలేకపోయింది. ఏదో విధంగా ఈ వ్యవస్థను దెబ్బ తీయడానికి కొన్నేళ్లుగా ఆ పార్టీ నేతలు చేయని ప్రయత్నం లేదు. అనేక రకాల అభాండాలు వేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో వలంటీర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. చివరకు ఎన్నికల కోడ్ ముగిసేంత వరకూ పింఛన్ల పంపిణీతో పాటు సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లను పక్కన పెట్టాలని ఎన్నికల కమిషన్ ఆదేశించేలా చేయగలిగారు. జీవితపు మలి సంధ్యలో ఉన్న తమపై టీడీపీ ఇంత దారుణంగా పగబట్టడంపై అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కాకినాడ సాంబమూర్తినగర్‌లో వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్

జిల్లాలో ప్రతి నెలా పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్ల వివరాలు

గ్రామ సచివాలయాలు	: 445
వలంటీర్లు	: 9,015
వార్డు సచివాలయాలు	: 175
వలంటీర్లు	: 3,257
వైఎస్సార్ పింఛను కానుక లబ్ధిదారులు	: 2,75,288
ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	: రూ.75.77 కోట్లు

పింఛన్ల పంపిణీ మార్గదర్శకాలివీ..

ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో ఈ నెల నుంచి జూన్ వరకూ గ్రామ/వార్డు సచివాలయాల్లోనే పింఛన్లు పంపిణీ చేయనున్నారు. లబ్ధిదారులు ఆయా సచివాలయాలకు వెళ్లి, వేలిముద్ర వేసి పింఛన్లు పొందాలి. దీనికోసం సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు సెర్ప్ ఆదివారం మార్గదర్శకాలు జారీ చేసింది. సచివాలయాల్లో పింఛన్ల పంపిణీని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారు. ఈ నెల 1వ తేదీ సోమవారం బ్యాంకులకు సెలవు కావడంతో పింఛన్లకు సంబంధించిన మొత్తాన్ని ప్రభుత్వం 2వ తేదీన బ్యాంకులకు విడుదల చేస్తుంది. అదే రోజున గ్రామ పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అర్బన్ ప్రాంతాల్లో వార్డు అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకుల నుంచి నగదు డ్రా చేస్తారు. మూడో తేదీ నుంచి 6 రోజుల పాటు సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేస్తారు. పింఛన్లు పంపిణీ చేసే సచివాలయ ఉద్యోగులు, ఆర్‌బీకే ఇన్‌చార్జిలందరి వద్ద ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు జారీ చేసిన ధ్రువపత్రాలు ఉంటాయి.



మళ్లీ ఆందోళన మొదలైంది

నేను దివ్యాంగురాలిని. ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ ఇంటికి వచ్చి ఠంచనుగా పింఛన్ ఇవ్వడంతో దర్జాగా తీసుకునేవాళ్లం. మాకు ఈ ఐదేళ్లు ఏ కష్టమూ తెలియలేదు. మంచి, చెడ్డ అన్నీ వలంటీర్ చూసుకునేది. ఇప్పుడు ఎన్నికల పుణ్యమా అని ముఖ్యమంత్రి జగన్‌పై ఉన్న కోపంతో వలంటీర్లను నిలుపు చేయడంతో ఈ రోజు పెన్షన్ రాలేదు. గతంలో పెన్షన్ తీసుకోవాలంటే పంచాయతీ కార్యాలయానికి వెళ్లి, అక్కడ ఇవ్వకపోతే మరో రోజు వెళ్లి గంటల తరబడి వేచి ఉండి తీసుకునేవాళ్లం. ఇప్పుడు మాకు మళ్లీ అదే పరిస్థితి ఏర్పడుతుందేమోనని ఆందోళనగా ఉంది. పెన్షన్ ఎప్పుడు ఇస్తారంటే తెలియదనే సమాధానం వస్తోంది.

– గుత్తుర్తి, వీరమ్మ, దివ్యాంగురాలు, గాంధీనగర్, సామర్లకోట

ఇబ్బందులు పునరావృతం



గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ సొమ్ము తీసుకోవడానికి నానా పాట్లూ పడాల్సి వచ్చేది. నెలలో 10వ తేదీ దాటితేనే కానీ పింఛన్ తీసుకునే పరిస్థితి ఉండేది కాదు. ఈ సొమ్ము కోసం అప్పట్లో పంచాయతీ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థతో మా కష్టాలన్నీ ఒక్కసారిగా తీరిపోయాయి. ఇప్పుడు ఎన్నికల నెపంతో వలంటీర్లను విధులకు దూరం చేయడం పేదలపై కక్ష కట్టడమే అవుతుంది. ఇప్పటికైనా వలంటీర్ల విషయంలో పునరాలోచన చేయాలి.

– తమ్మన వెంకటరత్నం, వృద్ధురాలు, ధర్మవరం, ప్రత్తిపాడు రూరల్

ముమ్మాటికీ పేదలపై కక్ష సాధింపే



ఎన్నికల పేరు చెప్పి పేదలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఇంటి వద్దనే అందించే పింఛనును ఎన్నికలను అడ్డం పెట్టుకుని సచివాలయం వద్ద ఇస్తారంటున్నారు. అక్కడ ఎప్పుడిస్తారో తెలియదు. పూటల తరబడి పడిగాపులు పడాల్సిన పరిస్థితి సృష్టించారు. ఇంటి వద్ద తెల్లారేసరికి పింఛను తీసుకుని, కూలీ పనికి వెళ్లేదాన్ని. ఇప్పుడు పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లడం వల్ల ఒక రోజు కూలి డబ్బులు నష్టపోవలసి వస్తుంది. ఎన్నికలయ్యే వరకూ ఈ తిప్పలు తప్పవేమో. ఈర్ష్యపరులు ఎన్ని అడ్డంకులు పెట్టినా మళ్లీ ఇదే ప్రభుత్వాన్ని గెలిపించుకుని ఇంటి వద్దనే నా పింఛను తీసుకుంటాను.

– షేక్ సకీనా బీబీ, వితంతువు, తాళ్లూరు, తుని మండలం

పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌కు ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నివాస్ తదితరులు

కాకినాడ సిటీ: ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌కు, వృద్ధులు, దివ్యాంగులు హోమ్ ఓటింగ్‌కు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. విజయవాడలోని తన కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ చేపడతామని ఈ సందర్భంగా చెప్పారు. పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్, పీఓలు, ఏపీఓలు, ఇతర ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, ఫెసిలిటీ సెంటర్లు, జిల్లాలో ఎన్నికల సక్రమ నిర్వహణకు సన్నద్ధత, ఇతర అంశాలపై ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్‌తో చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, డీపీఓ కె.భారతి సౌజన్య, సైనిక సంక్షేమ అధికారి ఎం.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది కవి సమ్మేళనంలో 143 మంది

శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్

అమలాపురం టౌన్: శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7న అమలాపురం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో జరగనున్న 132వ ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో పలు రాష్ట్రాలకు చెందిన 143 మంది కవులు పాల్గొంటున్నారని ఆ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ వెల్లడించారు. స్థానిక పట్టాభివీధిలోని సాయి సంజీవని ఆస్పత్రి ఆడిటోరియంలో జిల్లా శ్రీశ్రీ కళావేదిక సోమవారం నిర్వహించిన కవి సమ్మేళనం సన్నాహక సమావేశానికి డాక్టర్ ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కవులు సమ్మేళనంలో అధికంగా పాల్గొంటారని చెప్పారు. కవి సమ్మేళనం ఆ రోజు ఉదయం 8.30 గంటలకు మొదలై సాయంత్రం 6 గంటల వరకూ నిర్విరామంగా జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బ్రోచర్లను డాక్టర్ ప్రతాప్‌తోపాటు కవులు ప్రదర్శించారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వేదిక జిల్లా అధ్యక్షుడు, జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గుర్రం రామకృష్ణారావు, మాకే బాలార్జున సత్యనారాయణ పాల్గొన్నారు.

బకాయి పడిన పంచాయతీలకు విద్యుత్ పునరుద్ధరణ

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నిధులు విడుదలై, బకాయిలు చెల్లించని పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిపివేసి, వెంటనే పునరుద్ధరిస్తామని ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 శాతం గ్రాంట్ విడుదల చేసి, బకాయిలు చెల్లించాల్సిందిగా పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినా కొన్ని పంచాయతీలు చెల్లించలేదని, వారికి అవగాహన కల్పించేందుకే విద్యుత్ సరఫరా నిలిపివేశామని వివరించారు. ప్రజావసరాలకు సంబంధించిన వీధి దీపాలు, తాగునీటి పథకాల విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా పంచాయతీ కార్యాలయాలకు మాత్రమే సరఫరా నిలిపామన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,069 పంచాయతీల నుంచి రూ.282.83 కోట్ల విద్యుత్ బకాయిలున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.77 కోట్లు ఫిబ్రవరిలో విడుదలయ్యాయని, వీటితో విద్యుత్ బకాయిలు చెల్లించాల్సిందిగా ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. నోటీసులు అందుకున్న 451 పంచాయతీలు రూ.6.29 కోట్ల విద్యుత్ బిల్లు బకాయిలు చెల్లించాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించని, అసలు బకాయిలు చెల్లించని పంచాయతీల్లోనే ప్రాథమిక చర్యగా సరఫరా నిలిపివేసి, వెంటనే పునరుద్ధరించామని మూర్తి వివరించారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పని చేయాలి



ముద్రగడను కలిసిన పిఠాపురం నియోజకవర్గ మాల మహానాడు నాయకులు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ విజయానికి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు గుబ్బల రాజుతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ నాయకులు, కార్యకర్తలు ముద్రగడను, యువ నాయకుడు గిరిబాబును వారి నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గుబ్బల రాజు మాట్లాడుతూ, రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న ముద్రగడ వైఎస్సార్ సీపీలో చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. ఆయన సలహాలు, సూచనలతో కులాలకు అతీతంగా పార్టీ విజయమే ప్రథమ లక్ష్యంగా పని చేస్తామని అన్నారు.

స్ట్రాంగ్ రూము, కౌంటింగ్ కేంద్రం పరిశీలన



స్ట్రాంగ్ రూము, కౌంటింగ్ హాలును పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్, పెద్దాపురం, తుని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూము, కౌంటింగ్ హాలు, రిసెప్షన్ సెంటర్లను, వెహికల్ పార్కింగ్ తదితర ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ సోమవారం రాత్రి పరిశీలించారు. మెకానికల్ ఇంజినీరింగ్ బ్లాక్, సివిల్ ఇంజినీరింగ్ పీజీ బ్లాక్, ఇన్నోవేషన్ రీసెర్చ్ సెంటర్లను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓ), రెవెన్యూ అధికారులతో కలసి సందర్శించి, అక్కడి సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నివాస్ వెంట కాకినాడ సిటీ ఆర్ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, కాకినాడ రూరల్ ఆర్ఓ, ఆర్డీఓ ఇట్ల కిషోర్, పెద్దాపురం ఆర్ఓ, ఆర్డీఓ జె.సీతారామారావు, తుని ఆర్ఓ, కేఎస్ఈజెడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.కృష్ణారావు, కాకినాడ అర్బన్ తహసీల్దార్ కె.చెల్లన్నదొర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యదేవుని ఆలయ వార్షికోత్సవం

- ప్రత్యేక పూజలు, పండితులకు ఘన సత్కారం
- ఆలయ శిఖరానికి త్వరలోనే స్వర్ణ కాంతులు
- దేవదాయ కమిషనర్ సత్యనారాయణ వెల్లడి



వేద పండితులను సత్కరించిన కమిషనర్ సత్యనారాయణ, ఈఓ రామచంద్ర మోహన్ దంపతులు



నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను అభినందిస్తున్న కమిషనర్ సత్యనారాయణ, ఈఓ రామచంద్ర మోహన్

అన్నవరం: భక్తవరదుడైన సత్యదేవుని నూతన ఆలయ పునర్నిర్మాణం, శిఖర ప్రతిష్ఠ జరిగి, పుష్కర కాలం (12 సంవత్సరాలు) పూర్తయిన సందర్భంగా రత్నగిరిపై సోమవారం 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున సత్యదేవుడు, దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, శంకరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కదంబం ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి ఆలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ, సత్యదేవుని నూతన ఆలయ శిఖరానికి దాతల సహకారంతో స్వర్ణ రేకు తాపడం చేయించేందుకు త్వరలోనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. దీనికి 11.5 కిలోల బంగారం అవసరమవుతుందని, దీనికి సుమారు రూ.7.5 కోట్ల వ్యయమవుతుందని చెప్పారు. ఈ మేరకు దేవస్థానం అధికారులు నివేదిక పంపారని తెలిపారు. దీనిపై టీటీడీ నిపుణుల నివేదిక కోరామని, అది వచ్చిన వెంటనే అనుమతి మంజూరు చేస్తామని వివరించారు. సత్యదేవుడు తనకు చాలా ఇష్టమైన దైవమని అన్నారు. తాను గతంలో ఇక్కడ ఈఓగా పని చేశానని నాటికి, నేటికి ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు.

దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ మాట్లాడుతూ, తాను 2010లో ఇక్కడకు ఈఓగా వచ్చినప్పుడు శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని చూసి ఆవేదన చెందానన్నారు. దీనిని పునర్నిర్మించాలనుకున్నానని, అయితే కొంత మంది వ్యతిరేకించడంతో శృంగేరి పీఠాధిపతి జగద్గురు భారతీతీర్థ స్వామి వారిని కలిసి పరిస్థితి వివరించానని చెప్పారు. స్వామి, అమ్మవారు, శంకరుల మూలవిరాట్టులను కదపకుండా ఆలయ పునర్నిర్మాణం చేపట్టాల్సిందిగా నాడు స్వామీజీ ఆదేశించారని తెలిపారు. ఆ మేరకు మూలవిరాట్టులకు పటిష్ట రక్షణ ఏర్పాట్లు చేసి, 2011లో నూతన ఆలయ నిర్మాణం ప్రారంభించి, ఏడాది లోగా పూర్తి చేశామని చెప్పారు. నూతన ఆలయ శిఖరంపై 2012 మార్చి 14న ఫాల్గుణ బహుళ సప్తమి నాడు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి వారి చేతుల మీదుగా కలశ స్థాపన చేసి, ఆలయాన్ని ప్రారంభించామని తెలిపారు. 13వ వార్షికోత్సవం జరిపే అవకాశం తనకు కలగడం సంతోషంగా ఉందని ఈఓ చెప్పారు.

నాడు నూతనాలయ శిఖర ప్రతిష్ఠలో పాల్గొన్న ఐదుగురు పండితులను కమిషనర్ సత్యనారాయణ, ఈఓ రామచంద్ర మోహన్ ఘనంగా సత్కరించారు. విశ్రాంత వేద పండితుడు ముష్టి కామశాస్త్రి, విశ్రాంత ప్రధానార్చకుడు నాగాభట్ల సత్యనారాయణ, వేద పండితుడు గొల్లపల్లి వేంకట రామసుబ్రహ్మణ్య ఘనపాఠి, మహావిద్యా పారాయణదారు ఓరుగంటి ఫణిశర్మ, విశ్రాంత ప్రధానార్చకుడు కొండవీటి సత్యనారాయణ తరఫున ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మలను ఘనంగా సత్కరించారు. కమిషనర్ దంపతులను ఈఓ సత్కరించారు. నూతనాలయం నిర్మించిన ఈఓ రామచంద్ర మోహన్‌ను దేవస్థానం సిబ్బంది తరఫున కమిషనర్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈఓ రమేష్‌బాబు, ఈఈలు బాలమురళి, నరసింహారెడ్డి, ఏఈఓ కృష్ణారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ వేడుకల సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఆ చిన్నారులను, వారి నాట్యగురువులను కమిషనర్, ఈఓ అభినందించారు.

22న సత్యదేవుని నమూనా ఆలయ శిఖర ప్రతిష్ఠ

జాతీయ రహదారిపై విశాఖపట్నం – విజయవాడ మార్గానికి ఆనుకుని డిగ్రీ కళాశాల వద్ద రూ.4.5 కోట్లతో నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయంపై ఈ నెల 22న కలశ ప్రతిష్ఠ, సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఈఓ కె.రామచంద్ర మోహన్ తెలిపారు. స్వామి, అమ్మవారు శిలా విగ్రహాల తయారీకి కాకినాడకు చెందిన ఇద్దరు దాతలు రూ.లక్ష విరాళం సమర్పించారని తెలిపారు. స్వామివారి నమూనా ఆలయం పనులు ఈ నెల 20వ తేదీకి పూర్తి చేయాల్సిందిగా ఆదేశించామన్నారు. కాగా, రత్నగిరిపై సత్యదేవుని ఆలయంలో ధ్వజస్తంభం తొలగింపు పనులను కమిషనర్ సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిని ఆయనకు ఈఓ వివరించారు. ఇప్పటికే ధ్వజస్తంభం పీఠం చుట్టూ ఉన్న గ్రానైట్ కట్టడం తొలగించామని, మంగళవారం పాత ధ్వజస్తంభాన్ని పూర్తిగా పైకి లేపుతారని తెలిపారు. ఈ నెల 22న నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠించనున్నామని చెప్పారు. ఈ పనులు నిర్విఘ్నంగా సాగేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆదేశించారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి ప్రో-కార్ రేసింగ్ సీజన్-4 పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న వైస్ చైర్మన్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ప్రో-కార్ రేసింగ్ సీజన్-4 పేరిట పోటీలు నిర్వహిస్తున్నట్టు కళాశాల వైస్ చైర్మన్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. సోమవారం నుంచి నాలుగు రోజులపాటు జరగనున్న ఈ పోటీలకు చెన్నై, కర్ణాటక, తెలంగాణ, తదితర రాష్ట్రాల నుంచి 13 టీమ్‌లకుగాను 350 మంది సభ్యులు పాల్గొంటున్నట్టు తెలిపారు. వాహనాల వేగం, మోడల్, వెయిట్, బ్రేక్, ఇంజిన్ పికప్, లోడ్, తదితర అంశాలతో నిర్వహించిన ఈ పోటీలలో ప్రతి విభాగం నుంచి బహుమతులు అందజేస్తామన్నారు.

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ముమ్మిడివరం: యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 2,100 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం పడమటపాలెంకు చెందిన మంజుల సతీష్‌కుమార్, నడకుదటి బాలకృష్ణ సోమవారం వ్యాన్‌లో అక్రమంగా డీజిల్ తరలిస్తుండగా పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. వ్యాన్ సీజ్ చేశారు. ఈ మేరకు ఎస్సై డి.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిచ్చగాడి మృతి


బిచ్చగాడి మృతదేహం

గండేపల్లి: ఓ బిచ్చగాడు మృతి చెందినట్టు గండేపల్లి ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు వెళ్లే మార్గంలో మండలంలోని తాళ్లూరు శివారు దాబా సెంటర్ వద్ద అపస్మారక స్థితిలో సుమారు 60 నుంచి 70 సంవత్సరాల వయస్సు కలిగిన భిక్షగాడిని స్థానికులు గుర్తించి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలం వద్దకు చేరుకున్న పోలీస్ సిబ్బంది అతనిని 108 అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్టు తెలిపారు. మృతుడిపై నలుపు రంగు ప్యాంట్, ఎరుపు, తెలుపు, నలుపు రంగు కలిగిన దుప్పటి ఉందని, పెద్దాపురం మార్చురీలో ఉంచినట్టు తెలిపారు. అతని వివరాలు తెలిసినవారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

వైవిధ్య భరితం.. అరుదైన చరితం

- అమ్మవారి జాతర్లలో భిన్నమైన ఆచారాలు
- దుష్టశక్తులు రాకుండా కర్రలతో కాపలా
- దోషాలు పోవాలంటే దున్నపోతు తొక్కాల్సిందే


ఉప్పాడ శివారు కొత్తపట్నంలో నేరేళ్లమ్మవారు


అమీనాబాద్ గ్రామంలో దున్నపోతుతో తొక్కించుకుంటున్న గ్రామస్తులు (ఫైల్)


కొత్తపట్నంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించేటప్పుడు దుష్టశక్తులు రాకుండా కర్రలతో కొడుతూ కాపలా కాస్తున్న యువకులు (ఫైల్)

పిఠాపురం: అది ఉప్పాడ సాగర తీరం. సముద్ర కెరటాల హోరు నిత్యం ధ్వనిస్తుంటుంది. కాని ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో అమావాస్య, పౌర్ణమిలకు సముద్ర ఘోషను సైతం తోసిరాజని అమ్మవార్ల నామస్మరణ మారు మోగుతుంది. గ్రామే దేవతల జాతరలతో అన్ని గ్రామాలు పులకించిపోతాయి. తీర ప్రాంతంలో అమ్మవార్ల జాతరలు విభిన్న ఆచారాలతో ఆకట్టుకుంటాయి. కళకళలాడుతున్న విద్యుద్దీపాల మధ్య జనం చుట్టూ ఉండి కర్రలతో కొడుతున్న దృశ్యం చూస్తే అక్కడ ఏదో పెద్ద గొడవ జరుగుతోందని, ఎవరినో మధ్యలో పెట్టి కొడుతున్నారనే అనుమానం వస్తుంది. కాని అది ఒక ఆచారం అని తెలిసాక ఆశ్చర్యపోక తప్పదు. జనం అందరూ నేలపై పడుకుని ఉండగా ఒక దున్నపోతు వారిపై నుంచి పరుగులు తీస్తుంటే పక్కనే ఊరంతా గుమిగూడి చూస్తూ దణ్ణం పెడుతుంటే ఇదేంటి ఇంత దారుణం జరుగుతున్నా అలా చూస్తున్నారేమిటి అని పిస్తుంది కాని అదీ ఒక ఆచారమే అని తెలిసాకా ఔరా అనిపించకమానదు. మార్చి నెల రెండవ వారం నుంచి అన్ని గ్రామాలు, పట్టణాల్లో గ్రామ దేవతల సంబరాలు ప్రారంభమవుతాయి. మే నెల మొదటి వారం వరకు ఇవి కొనసాగుతాయి. విభిన్న ఆచారాల కలబోతతో కుల మతాలకు అతీతంగా ఈ ఉత్సవాలు జరుపుకుంటారు.

తీరంలో తీరే వేరు..

ఇక తీర ప్రాంత గ్రామాల్లో ఆలయాల దేవతలు చిత్ర విచిత్రంగా ఉంటారు. అక్కడ ఉండేవి ఆలయాలే కాని నిత్యధూప, దీప, నైవేద్యాలు, పూజలు ఉండవు. కానీ అమ్మవారి ప్రతిమలు ఉంటాయి. కొలిచే భక్తులు కోకొల్లలే వైవిధ్య భరితంగా కనిపించే ఆ ఆలయాల్లో మత్స్యకారులు కొలిచే దేవతలు ఉంటారు. సాధారణంగా గ్రామ దేవతల ఆలయాలలో ఎక్కువ శాతం నిత్య ధూప దీప నైవేద్యాలు ఉండక పోయినా భద్రత ఉంటుంది. ఆలయాలకు తలుపులు, ప్రహరీ గోడలు ఉంటాయి. వాటిలో విగ్రహాలకు కచ్చితమైన రూపురేఖలు ఉంటాయి కానీ ఇక్కడ అవేమీ కనిపించవు. మత్స్యకారులు మనస్సులోనే అమ్మను తలచుకుంటూ ఆమెపై భారం వేసి జీవనోపాధికి వెళుతుంటారని చెబుతున్నారు. తీర ప్రాంత గ్రామాలలో మాత్రమే కనిపించే ఈ ఆలయాలు ఎంతో విశిష్టతను కలిగి ఉంటాయి. నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంపై చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు తమతమ ఇష్టదైవాలైన అమ్మవార్లకు మొక్కుకుని వేటకు వెళుతుంటారు. దానికి అనువుగా నిర్మించుకున్న ఆలయాలు చూసేవారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంటాయి.

ఆద్యంతం ఆకట్టుకునేలా..

అత్యంత నియమ నిష్ఠలతో మత్స్యకారులు చేసే అమ్మవారి జాతరలు ఆద్యంతం ఆకట్టుకుంటాయి.

పూర్వం నుంచీ..

ఉప్పాడ శివారు కొత్తపట్నంలో వేంచేసియున్న గ్రామ దేవత నేరేళ్లమ్మ జాతరలో అమ్మవారికి నైవేద్యం సమర్పించేటప్పుడు ఊళ్లో యువకులంతా కలిసి కర్రలతో కాపాలా కాస్తారు. నైవేద్యం సమర్పించే టప్పుడు దుష్టశక్తులు ఏవీ రాకుండా కర్రలతో కొడుతు అమ్మవారికి నైవేద్యం సమర్పించడం ఇక్కడ పూర్వ కాలం నుంచి వస్తున్న ఆచారంగా స్థానికులు చెబుతున్నారు.

సాధారణంగా మత్స్యకారులు పూజించే అమ్మవార్ల పేర్లు నేరేళ్లమ్మ, భాగిర్తమ్మ, బంగారమ్మ, గంగమ్మ, కాశిమ్మ, పోలేరమ్మ, చినతల్లి, పెదతల్లి అనేటి వంటి అనేక పేర్లతో పిలుచుకుంటారు. ఇతర ప్రాంతాల్లో ముత్యాలమ్మ, నక్కుళ్లమ్మ, సత్తెమ్మ, బోడ కొండమ్మ, నూకాలమ్మ, మరిడమ్మ, మావుళ్లమ్మ తదితర పేర్లతో పిలుస్తుంటారు.

దోషాలు పోతాయని

అమీనాబాద గ్రామంలో పోలేరమ్మ జాతరలో ఒక దున్న పోతును జాతరకు ముందు కొన్ని నెలల నుంచి పెంచి పోషించి ప్రత్యేక పూజల అనంతరం దానితో తొక్కించుకుంటారు. గ్రామంలో ప్రజలు స్నానాలు చేసి వరుసగా నేలపై పడుకుని ఉండగా దున్నపోతును వారిపై నుంచి నడిపిస్తారు. దున్నపోతు గిట్టలు తమ శరీరాలకు తగిలితే వారికి ఉన్న రోగాలు పోతాయని వారి ఆచారంగా స్థానికులు చెబుతారు.

ఏడాదిలో ఒకటే పండగ

సాధారణంగా గ్రామ దేవతల ఆలయాలలో ఎక్కువ శాతం వారానికి ఒక సారైనా సాధారణ పూజలు చేస్తుంటాం. కానీ గ్రామ దేవతల ఆలయాలలో దేవతలకు మాత్రం ఏడాదికి ఒకసారి అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తాం. కఠికమైన నియమనిష్టలతో ఉపవాసాలు ఉండి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అగ్నిగుండాలు తొక్కడం వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తాం. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయాలను సుందరంగా తీర్చిదిద్ది ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తాం. మా ఆచారం ప్రకారం అమ్మవారికి నైవేద్యం సమర్పించేటప్పుడు దుష్టశక్తులు రాకుండా కాపాలా కాస్తుంటాం.

వనమాడి జగన్నాథం, కొత్తపట్నం, ఉప్పాడ

మా తాతల నాటి నుంచీ..

మా తాతల కాలం నుంచీ దున్నపోతుతో తొక్కించుకోవడం ఆచారంగా వస్తోంది. ఇది చాలా నిష్టగా చేస్తారు. మా గ్రామంలో అమ్మోరులుగా కొందరు మహిళలు ఉంటారు. వారికి దండలు వేసి అమ్మవారిగా భావిస్తారు. గ్రామస్తుల కింద పడుకుని ఉండగా వారిపై నడిపిస్తారు. వీరితో పాటు దున్నపోతును నడిపిస్తారు. ఇలా చేయడం వల్ల మా గ్రామంలో ఉన్న దోషాలు పోతాయని నమ్ముతాం.

– నక్కా మణికంఠ, సర్పంచ్ అమీనాబాద్, కొత్తపల్లి మండలం

ఉగాదికి నాటికల పోటీలు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పరిషత్ కన్వీనర్ వెంకటరెడ్డి, అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, సెక్రటరీ అశోక్‌రెడ్డి తదితరులు

రావులపాలెం: ఉగాదికి కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ) కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలను నిర్వహిస్తున్నట్టు కళాపరిషత్ కన్వీనర్ గొలుగూరి వెంకటరెడ్డి, సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్ రెడ్డి, కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య తెలిపారు. సోమవారం స్థానిక సీఆర్‌సీ ఓల్డేజ్ హోమ్‌లో మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వారు వెల్లడించారు. నాటికల పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. 24వ ఉగాది నాటికల పోటీలకు నలుగురు సీనియర్ కాటన్ కళాపరిషత్ సభ్యులు నెల రోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పరిషత్‌ల నాటికలు 60 చూసి ఏడింటిని ఎంపిక చేశారన్నారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఉగాది సందర్భంగా ఈ నాటికలను ప్రదర్శిస్తామన్నారు. తొలిరోజు రెండు నాటికలు గంగోత్రి పెదకాకాని వారి అస్తికలు, పండు క్రియేషన్స్ ఒంగోలు వారి పక్కింటి మొగుడు ప్రదర్శిస్తామన్నారు. రెండో రోజూ మూడు నాటికలు కరీంనగర్ చైతన్య కళాభారతి వారి చీకటి పువ్వు, హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్స్ వారి థింక్, హైదరాబాద్ మల్లాది క్రియేషన్స్ వారి సీకట్లో సెంద్రుడు హాస్య నాటిక ఉంటాయన్నారు. మూడో రోజు రెండు నాటికలు గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇంద్రప్రస్థం, విజయవాడ మైత్రి కళానిలయం బంధం నాటికలతోపాటు చివరి రోజు సీఆర్‌సీ వారి ప్రత్యేక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ప్రత్యేక ప్రదర్శన నాటికను కళాపరిషత్ కన్వీనర్ విక్టరీ వెంకటరెడ్డి రచన చేయగా, దర్శకత్వం గంటా రామమోహన్‌రావు వహిస్తారన్నారు. ప్రారంభం రోజున నృత్య ప్రదర్శనలు, పంచాంగ శ్రవణం, కాటన్ కళా పురస్కారం ప్రదానం ఉంటుందన్నారు. పోటీల ప్రారంభానికి సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, డైరెక్టర్లు వంశీ, అజయ్ భూపతి, దండు కార్తీక్, గౌతంరాజు, కోట శంకరరావు, సారిక రామచంద్రరావు హాజరవుతారన్నారు. సమావేశంలో సీఆర్‌సీ సెక్రటరీ కర్రి అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నం తేజారెడ్డి, నాటక కళా పరిషత్ డైరెక్టర్ కె.సూర్య, స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, పీఎస్‌ఎన్‌రెడ్డి, పలివెల త్రిమూర్తులు పాల్గొన్నారు.

హత్య కేసులో భర్తకు రెండేళ్ల జైలు

రాయవరం: భార్యను శారీరకంగా మానసికంగా వేధింపులకు గురిచేసి ఆమె హత్యకు కారణమైన భర్తకు రామచంద్రపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సోమవారం జైలు శిక్ష విధించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రాయవరం ఎస్సై జి.నరేష్ విలేకరులకు తెలిపారు. రాయవరం మఠం వీధికి చెందిన పిచ్చుక బుల్లియ్యకు కడియం మండలం దుళ్ళకు చెందిన జక్కం వీర వెంకట సత్యనారాయణ కుమార్తె దేవిని ఇచ్చి వివాహం చేశారు. వివాహం అనంతరం కొంతకాలం వారి కాపురం సజావుగా సాగింది. అనంతరం దురలవాట్లకు అలవాటు పడిన బుల్లియ్య దేవిని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేసేవాడు. వేధింపులకు తట్టుకోలేక దేవి 2015 సెప్టెంబర్ 24న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై అప్పటి ఎస్సై చావా సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహించారు. కేసు వాదోపవాదాల అనంతరం భార్య దేవిని బుల్లియ్య శారీరక, మానసిక వేధింపులకు గురి చేసినట్టు నిర్ధారించి జడ్జి కె.వెంకటేశ్వరరావు రెండు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎంవీవీ ప్రకాశరావు వాదనలు వినిపించారు. ఎస్సై నరేష్, హెచ్‌సీ కేవీ రాఘవులు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు.

నిచ్చెన లేక మృత్యు కుహరానికి..

- వెల్డింగ్ చేస్తుండగా పేలిన ట్యాంకర్
- ఇద్దరి మృతి, ఒకరికి గాయాలు
- కత్తిపూడిలో విషాదం


కొంజర్ల ప్రభాకర్


బూరా సోమరాజు


పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద మృతుల బంధువులు, స్నేహితులు

పిఠాపురం: చిన్న నిచ్చెన పెద్ద ప్రమాదానికి కారణమయ్యింది. ఆ నిచ్చెన లేక పైకి ఎక్కి మూతలు తీయడం కుదరక చిన్న పనే కదా అనుకుని ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా తొందరపడి వెల్డింగ్ చేయడంతో పెద్ద ప్రమాదం ఏర్పడి రెండు కుటుంబాలను దిక్కు లేని వారిని చేసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండల శివారు ప్రాంతంలో ఒక ఆయిల్ ట్యాంకర్‌కు వెల్డింగ్ చేస్తుండగా అది పేలిపోవడంతో ఇద్దరు మృతి చెందగా ఒకరికి గాయాలయిన ఘటన మృతుల స్వగ్రామం కత్తిపూడిలో విషాదాన్ని నింపింది. కత్తిపూడికి చెందిన గాబు గంగాధర్ తన అయిల్ ట్యాంకర్‌కు మరమ్మతులు చేసేందుకు కత్తిపూడికి చెందిన లారీ డ్రైవరు బూరా సోమరాజు అలియాస్ శ్యామ్యూల్ (45)ను వెల్డింగ్ మేస్త్రీ కత్తిపూడికి చెందిన కొచ్చెర్ల ప్రభాకర్ వద్దకు పంపించాడు. వారు గొల్లప్రోలు మండలం దుర్గాడ శివారు తొండంగి మండలం రావికంపాడు సమీపంలో ఏలేరు కాలువ వద్ద ఉన్న వెల్డింగ్ షాపునకు వెళ్లారు. కొచ్చెర్ల ప్రభాకర్ వెల్డింగ్ చేస్తున్నాడు. పనిని లారీ డ్రైవరు బూరా సోమరాజు దగ్గర ఉండి చూస్తున్నాడు. ఇంతలో ఆయిల్ ట్యాంకు ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోవడంతో దగ్గరగా ఉన్న లారీ డ్రైవరు బూరా సోమరాజు, వెల్డింగ్ మేస్త్రీ కొచ్చెర్ల ప్రభాకర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. వెల్డింగ్ షాపు ఓనరు నున్న లోవరాజుకు గాయాలు అయ్యాయి. గాయాలైన లోవరాజును పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు.


ప్రమాదంలో పేలి పోయిన ఆయిల్ ట్యాంకర్

నిచ్చెనే ప్రాణాలను తీసింది

ట్యాంకర్‌కు ఉన్న మూతలు తీయకుండా వెల్డింగ్ చేయడం వల్ల ట్యాంకు లోపల వేడి గాలి పెరిగి పేలుడు సంభవించినట్లు పోలీసులు భావిస్తున్నారు. సాధారణంగా ఆయిల్ ట్యాంకర్లకు పైన మూతలు ఉంటాయి. వాటిని ఎప్పుడూ మూసే ఉంచుతారు. ప్రస్తుతం ప్రమాదానికి గురైన ట్యాంకర్‌కు మూతలు వేసే ఉన్నాయి. ట్యాంకర్ వెనుక భాగంలో ఉండే నిచ్చెన ఊడి పోవడంతో అలా ఉండగా వెల్డింగ్‌కు తీసుకువచ్చిన డ్రైవరు మూతలు తీసి చేయిద్దామనుకుంటే పైకి ఎక్కి మూతలు తీయడానికి నిచ్చెన లేక వేరే విధంగా ఎక్కడానికి వీలు కుదరక చిన్న పనే కదా, అవసరం ఉండదని భావించి మూతలు తీయకుండానే వెల్డింగ్ చేయడం ప్రారంభించారు. అంతే వెల్డింగ్ మొదలు పెట్టిన నిమిషాల్లోనే పేలుడు సంభవించింది. ట్యాంకర్ ముక్కలు ముక్కలుగా విడిపోయి వెనుక వెల్డింగ్ పనిలో ఉన్న లారీ డ్రైవరు బూరా సోమరాజు, వెల్డింగ్ మేస్త్రీ కొంజర్ల ప్రభాకర్‌ల పైకి దూసుకువచ్చి బలంగా ఢీకొట్టడంతో వెనుకకు ఎగిరిపడిన ఇద్దరు వెనుక ఉన్న ఇనుప చట్రాలపై పడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్‌ను మంచినీటి సరఫరాకు వినియోగిస్తున్నారు. వాటర్ ట్యాంకు కావడం వల్ల పేలుడు ప్రభావం తక్కువగా ఉందని అదే ఆయిల్ ట్యాంకర్ అయితే లోపల ఉన్న కొద్ది పాటి ఆయిల్‌తో పేలుడు ధాటికి మంటలు కూడా వ్యాపించి పెద్ద విస్ఫోటం సంభవించేదని పోలీసులు చెబుతున్నారు.

పెద్ద దిక్కును కోల్పోయిన రెండు కుటుంబాలు

మృతుడు సోమరాజు 20 ఏళ్లుగా లారీ డ్రైవరుగా పని చేస్తున్నాడు. అతనికి భార్య ప్రియాంక. కుమారుడు వరుణ్, కుమార్తె సమీరా ఉన్నారు. లారీ డ్రైవరుగా ఉద్యోగం చేస్తూ సంపాదించిన దానిపైనే కుటుంబం నడుస్తోందని ఇక జీతం డబ్బులు తెచ్చి మమ్మల్ని పోషించేదెవరంటూ మృతుడి సోమరాజు భార్య,పిల్లలు రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది. మరో మృతుడు కొంజర్ల ప్రభాకర్‌కు భార్య చిన్నారి, కుమారులు త్రినాథ్, చందు, కుమార్తె తేజస్విని ఉన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం వారిది. కుటుంబం అంతా ప్రభాకర్‌పైనే ఆధారపడి ఉంది. ప్రమాదంలో ప్రభాకర్ చనిపోయాడని తెలిసి ఇక మాకు దిక్కెవరంటూ అతని భార్య పిల్లలు గుండెలవిసేలా రోదిస్తుంటే ఆపడం ఎవరితరం కాలేదు.

రాము కార్టూన్‌కి జ్యూరీ అవార్డు


అవార్డు సాధించిన కార్టూన్ (అంతరచిత్రం) మాడా రాము

అమలాపురం రూరల్: నార్త్ కోస్టల్ ఆంధ్ర కార్టూన్ ఫోరమ్, విశాఖపట్నం ఆధ్వర్యంలో హాస్యానందం మాసపత్రిక సౌజన్యంతో నిర్వహించిన కార్టూన్ పోటీల్లో అమలాపురం మండలం బండారులంక గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మాడా రాము కార్టూన్‌కు ప్రత్యేక జ్యూరీ బహుమతి లభించింది. తల్లిదండ్రుల డబ్బుతో విదేశాల్లో స్థిరపడిన పిల్లలు వారి బాగోగులు చూడకపోవడంతో, జీవచ్ఛవాలుగా మారిన దుస్థితిని వివరిస్తూ గీసిన చిత్రానికి జ్యూరీ అవార్డు ప్రకటించారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 72 మంది తెలుగు కార్టూనిస్టులు 194 ఎంట్రీలను పంపగా 25 ఉత్తమ కార్టూన్లు ఎంపిక చేశారని రాము తెలిపారు. బహుమతి ప్రదాన సభ 14వ తేదీన విజయవాడలో నిర్వహిస్తారని కార్టూనిస్ట్ రాము కి సమాచారం అందింది.

కాలువలో పడి కూలీ మృతి

కడియం: మండలంలో కడియపులంక వద్ద కోటిపల్లి కాలువలో పడి దామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాయపురెడ్డి అయ్యప్ప (45) అనే వ్యవసాయ కూలీ మృతి చెందాడు. సోమవారం కడియపులంక వచ్చిన అయ్యప్ప పని ముగించుకుని స్నానానికి పూలమార్కెట్ సమీపంలోనే కాలువ రేవు వద్దకు వచ్చాడు. అక్కడ స్నానానికి దిగుతుండగా ప్రమాదవశాత్తూ కాలువలో పడిపోయాడని స్థానికులు చెబుతున్నారు. కాసేపటికి అతడు మృతిచెందాడని వివరించారు. ఈ మేరకు కడియం పోలీస్‌లకు తెలియజేశారు.